
సాక్షి
నారాయణపేట
సోమవారం । 9 । జూన్ । 2025



'అజిలాపూర్'కు గ్రీన్‌సిగ్నల్

అజిలాపూర్‌లో లిఫ్ట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

వివరాలు 8లో ▸



క్రీడా పాఠశాల పిలుస్తోంది

క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాలకు త్వరలో ఎంపికలు జరుగనున్నాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
38.2 /21.6

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోత పెడుతుంది.

సర్పంచ్ టు మంత్రి..

అంచెలంచెలుగా ఎదిగిన ముదిరాజ్ బిడ్డ వాకిటి శ్రీహరి

- వ్యవసాయ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి..
- కుటుంబంలో అందరూ విద్యావంతులే..
- తొలిసారి ఎమ్మెల్యే.. తొలిసారే అమాత్యగిరి
- గతంలో ఎల్లారెడ్డి, పి.చంద్రశేఖర్, పులి వీరన్న, చిత్తరంజన్‌దాస్, శ్రీనివాసరావుకు అవకాశం
- బీసీ వర్గాలతో పాటు ఉమ్మడి పాలమూరు కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:

రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో మరో పాలమూరు వాసికి చోటు దక్కింది. వ్యవసాయ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చి.. అంచెలంచెలుగా ఎదిగిన మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని అమాత్య పదవి వరించింది. ఈ మేరకు హైదరాబాద్ రాజ్‌భవన్‌లో ఆదివారం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు మంత్రి పదవి రావడంతో బీసీ సంఘాలతో పాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ పరిధిలోని కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఉన్నారు. తాజాగా వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కడం పాలమూరుకు వరమని ఆ పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

తొలిసారి ఎమ్మెల్యే.. తొలిసారే మంత్రి..

2023 ఎన్నికల్లో మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వాకిటి శ్రీహరి కాంగ్రెస్ అభ్యర్థిగా తొలిసారి పోటీచేసి గెలుపొందారు. తొలిసారి ఎమ్మెల్యే అయిన ఆయన.. వెంటనే మంత్రి పదవి చేపట్టి ఘనత సాధించారు. గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి ఎల్కోటి ఎల్లారెడ్డి (మక్తల్), పి.చంద్రశేఖర్ (మహబూబ్‌నగర్), చిత్తరంజన్‌దాస్ (కల్వకుర్తి), శ్రీనివాసరావు (నాగర్‌కర్నూల్), పులి వీరన్న (మహబూబ్‌నగర్)కు ఈ అవకాశం దక్కగా.. శ్రీహరి వారి సరసన చేరడం విశేషం. కాగా, వాకిటి శ్రీహరితో పాటు ఆయన కుటుంబసభ్యులందరూ విద్యావంతులే. శ్రీహరితో పాటు ఆయన భార్య, ఆయన తమ్ముడు, మరదలు ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ప్రజాసేవలోనే ఉన్నారు.



విధేయత.. సామాజిక సమీకరణాలు..

వాకిటి శ్రీహరి విద్యార్థి దశలో యూత్ కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి ఆ పార్టీలోనే కొనసాగారు. సుదీర్ఘకాలంగా పార్టీకి విధేయుడిగా ముద్రపడిన ఆయనకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో మంచి సాన్నిహిత్యం ఉంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రను మక్తల్ నియోజకవర్గంలో విజయవంతం చేసి ప్రశంసలు పొందారు. దీంతో పాటు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన క్రమంలో మంత్రివర్గంలో బీసీలకు, అందులోనూ ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వారికి చోటు కల్పించాలన్న డిమాండ్ పెరిగింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ సైతం ముదిరాజ్‌కు మంత్రి పదవి ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా గెలిచిన ఎమ్మెల్యేలలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే శ్రీహరి ఒక్కరే కాగా.. విధేయత, సామాజిక సమీకరణాలు ఆయనకు కలిసి వచ్చాయని.. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని కాంగ్రెస్ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

వ్యవసాయ కుటుంబం నుంచి..

మక్తల్ పట్టణం నేతాజీ నగర్‌కు చెందిన వాకిటి శ్రీహరిది తొలుత వ్యవసాయ కుటుంబం కాగా.. కాంగ్రెస్‌లో చేరి క్రమక్రమంగా రాజకీయాల్లోకి వచ్చారు. కాంగ్రెస్, గాంధీ కుటుంబానికి విధేయుడిగా ఉంటూ ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌తో పాటు పార్టీలో మండల, ఉమ్మడి జిల్లా, విభజన అనంతరం నారాయణపేట జిల్లాలో వివిధ హోదాల్లో సేవలందించారు. వాకిటి శ్రీహరి తల్లి రాములమ్మ స్టాఫ్ నర్స్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. స్థానికంగా వేలాది మంది నిరుపేద మహిళలకు ఉచితంగా కాన్పులు చేసి రాములమ్మ సిస్టర్‌గా పేరు సాధించారు. తండ్రి వాకిటి నరసింహులు వ్యవసాయంతో పాటు చిన్నపాటి కాంట్రాక్టర్‌గా పనిచేశారు. వీరికి మొత్తం ఆరుగురు సంతానం కాగా.. నాలుగో కాన్పులో శ్రీహరి జన్మించారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకున్న ఆయన డిగ్రీ (బీఏ) దాకా విద్యాభ్యాసం కొనసాగించారు. 1996లో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఆయన మక్తల్ సర్పంచ్‌గా, జెడ్పీటీసీ సభ్యుడిగా, ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తాజాగా సామాజిక సమీకరణాల్లో భాగంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయనను కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి వర్గంలోకి తీసుకుంది.

రాజకీయ నేపథ్యం..

- వాకిటి శ్రీహరి 1990 నుంచి 1993 వరకు ఎన్ఎస్‌యూఐ మక్తల్ మండల ప్రెసిడెంట్‌గా.. 1993–1996 వరకు యూత్ కాంగ్రెస్ మక్తల్ మండల అధ్యక్షుడిగా.. 1996 నుంచి 2001 వరకు మక్తల్ మండల కాంగ్రెస్ కార్యదర్శిగా పనిచేశారు.
- 2001–2006 వరకు మక్తల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధిక మెజార్టీ సాధించి రికార్డుల్లోకెక్కారు.
- 2001–2006 ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు.
- 2006 నుంచి 2011 వరకు వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత దాసర్‌పల్లి ఎంపీటీసీ సభ్యురాలిగా ఉన్నారు. 2006 నుంచి 2011 వరకు ఆమె కాంగ్రెస్ మక్తల్ మండల అధ్యక్షురాలిగా పనిచేశారు.
- 2006 నుంచి 2012 వరకు వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి మక్తల్ మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్‌గా.. 2006 నుంచి 2014 వరకు యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్నారు.
- 2014 నుంచి 2018 వరకు వాకిటి శ్రీహరి మక్తల్ జెడ్పీటీసీ సభ్యుడిగా సేవలందించారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోనే రెండో మెజార్టీ స్థానంలో నిలిచారు. 2014 నుంచి 2018 వరకు కాంగ్రెస్ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్‌గా.. 2014 నుంచి 2018 వరకు మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.
- 2018 నుంచి వాకిటి శ్రీహరి కృష్ణా జలాల పరిరక్షణ సమితి సభ్యుడిగా ఉన్నారు. పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డితో కలిసి పనిచేశారు.
- 2019లో వాకిటి శ్రీహరి సోదరుడి భార్య రాధిక మక్తల్ మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు.
- 2022 సెప్టెంబర్ 03 నుంచి 2024 ఫిబ్రవరి వరకు నారాయణపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు.
- 2023 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేసి.. సమీప బీఆర్ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై 17,525 ఓట్లతో గెలుపొందారు. తాజాగా రెండో దఫాలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో కేబినెట్‌లో చోటుదక్కించుకున్నారు.

మంత్రి వాకిటి శ్రీహరి అమ్మమ్మ ఇంట్లో సంబరాలు

నారాయణపేట: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి వర్గంలో చోటు కల్పించడం, ఆదివారం ఆయన మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో జిల్లా కేంద్రంలోని మంత్రి అమ్మమ్మ పోషల్ శివమ్మ ఇంటా సంబరాలు అంబరాన్నంటాయి. శివమ్మ కుటుంబ సభ్యులు గొడుగుగేరిలోని అంజనేయస్వామి దేవాలయం దగ్గర టపాకులు పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. చిన్నారులు నృత్యాలు చేస్తూ ఆనందంగా డప్పు వాయిస్తూ కేరింతలు కొట్టారు. సత్యనారాయణ చౌరస్తాలో సైతం కుటుంబ సభ్యులందరూ మిఠాయిలను పంపిణీ చేశారు.



జిల్లా కేంద్రంలోని మంత్రి వాకిటి శ్రీహరి అమ్మమ్మ పోషల్ శివమ్మ ఇంటి వద్ద సందడి

న్యూస్‌రీల్

గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్లొద్దు : ఎస్పీ

నారాయణపేట: మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీంలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సొమ్ము దోచుకోనేందుకు సైబర్ నేరగాళ్లు రోజు, రోజుకో కొత్త కొత్త పోకడలు, కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారని తెలిపారు. గొలుసుకట్టు వ్యాపారాలు అంటూ మీరు చేరాలని, మీ కింద మరికొంతమందిని చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే మాటలను నమ్మవద్దు అని ఎస్పీ తెలిపారు. ఎక్కువ మందిని చేర్పిస్తే రివార్డులు, పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్లు ఆశ చూపుతారని, ఇలాంటి వారి మాయమాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా నష్టపోతారని తెలిపారు. వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి అమాయకులను ఆకర్శిస్తారని, మల్టీలెవల్ మార్కెటింగ్ రాకెట్‌ను చాలా మంది విదేశాల్లో ఉండి నడుపుతారని, అబద్దపు ప్రకటనపై అందరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ప్రకటనలు, వెబ్ లింకులు, ఏపీకె ఫైల్స్ లాంటివి డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ తెలిపారు.

జోగుళాంబ క్షేత్రంలో భక్తుల సందడి



అలంపూర్: అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. క్షేత్రానికి వచ్చిన భక్తులు జోగుళాంబ అమ్మవారి ఆలయాల్లో కుంకుమార్చన పూజలు, బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల వేసవి సెలవులు ముగియనుండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీనికి తోడు మృగశిరకార్తె కావడంతో రైతులు, వ్యవసాయ సంబంధిత వ్యాపారులు సైతం తెల్లవారుజాము నుంచే రావడం జరిగింది. దీంతో పట్టణ పురవీధులు వాహనాలతో రద్దీగా మారాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్థానిక పుష్కర ఘాట్‌లో స్నానాలు అచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం పలికారు. జోగుళాంబ రైల్వే హాల్ట్ వద్ద గేట్ పడిన ప్రతి సారి ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆలయ అధికారులు భక్తులకు తగు సౌకర్యాలు కల్పించారు. స్థానిక అన్నదాన సత్రంలో భక్తులకు అన్నప్రసాద వసతి కల్పించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పిల్లలమర్రి సమీపంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులలో చేరేందుకు విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చని టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ (డబ్ల్యూ) ప్రిన్సిపాల్ డా.జె.జయప్రద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ బీఎస్సీ–ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్సీ, ఎంజెడ్‌సీ, ఎంఎస్‌సీఎస్/ఎంఎస్‌డీఎస్, బీకాం (కంప్యూటర్స్), బిజినెస్ అనాలటిక్స్, బీఏ హెచ్ఈపీలలో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటిలో ప్రవేశం పొందాలనుకునే ఇంటర్ పాసైన వారు ఈనెల 23వ తేదీలోగా నేరుగా కళాశాలలో దరఖాస్తులను అందజేయాలని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్ మెమోలు, టీసీ, బోనఫైడ్, తాజా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ జిరాక్స్‌లతో పాటు ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత చేయాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 79950 10679, ఆమె 94901 16872లలో సంప్రదించవచ్చని సూచించారు.

నూనెగింజల సాగుతో అధిక లాభాలు

కొత్తకోట రూరల్: నూనెగింజల సాగుతో రైతులు అధిక దిగుబడులతో పాటు లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మిరాసిపల్లిలో 'వికసిత కృషి సంకల్ప అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. భారతీయ నూనెగింజల పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా. రమ్య వేరుశనగ, ఆముదం, పొద్దుతిరుగుడు, నువ్వుల రకాలు, సాగు యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, భూసార సంరక్షణ, నేల ఆరోగ్యం గురించి వివరించడంతో పాటు మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బడిబాట.. విద్యకు ప్రగతిబాట



కొత్తపల్లి మండలంలో బడిబాటపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యం
- 6 నుంచి 19 వరకు ప్రత్యేక కార్యక్రమాలు..
- డ్రాపౌట్స్ తగ్గింపే లక్ష్యంగా ముందుకు

నర్వ: జిల్లాలో సర్కారు బడుల్లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా ఈ నెల 6 నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విద్యాశాఖ ప్రారంభించింది. ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమం చొప్పున ఈ నెల 19 వరకు నిర్వహించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడం.. పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు.. పూర్తి వివరాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించడే కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఈమేరకు షెడ్యూల్‌ను డీఈఓ గోవిందరాజులు ఇదివరకే విడుదల చేశారు. కలెక్టర్ సిక్తాపట్నాయక్ నేతృత్వంలో సమావేశాలు నిర్వహించారు. వినూత్నంగా ఉపాధ్యాయులు గ్రామాల్లో పాఠశాలల విద్యాప్రగతితో కూడిన కరపత్రాలను ముద్రించి ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహిస్తున్నారు.

మండలాల స్థాయిలో..

మండల పరిషత్ అధికారులు, ఎస్ఐలు, ఇతర వర్గాల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేస్తారు. ఏ రోజు ఏం చేయాలనే కార్యచరణను ఎంఈఓ రూపొందిస్తారు. గ్రామ స్థాయిలో కమిటీలు, బడిబాటపై అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్వహిస్తారు. స్థానిక నేతల భాగస్వామ్యంతో బడిబాటలో గుర్తించిన విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియ చేపడుతారు.

బడిబాట లక్ష్యాలు..

- అన్ని గ్రామాల్లోని ఆవాస ప్రాంతంలో బడిఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం
- ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచుట, నాణ్యమైన విద్యను అందించడం
- అంగన్‌వాడీ కేంద్రాల్లో 5 ఏళ్ల దాటిన పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడం
- గ్రామ విద్య రిజిష్టర్‌ను అప్‌డేట్ చేయడం
- తక్కువ విద్యార్థులున్న పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచడం
- బాలికా విద్య ప్రాధాన్యతను తెలియజేస్తు వారిని పాఠశాలలో చేర్పించడం
- బడిబాటలో గ్రామాల్లోని పాఠశాలల పరిధిలోని ప్రజాప్రతినిధులను కార్యక్రమంలో పాల్గొనే విధంగా చూడడం
- ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమంలో ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించడం.
- ప్రత్యేక అవసరాలుగల పిల్లలను గుర్తించి నమోదు చేయడంతో పాటు పాఠశాలల్లో చేర్పించడం.

జిల్లా వివరాలిలా..	
ప్రాథమిక పాఠశాలలు	297
ప్రాథమికోన్నత పాఠశాల	86
ఉన్నత పాఠశాలలు	71
మొత్తం పాఠశాలలు	454
విద్యార్థుల సంఖ్య	52,314

షెడ్యూల్..

- మొదటి రోజైన జూన్ 6న ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులతో గ్రామసభ, రెండో రోజు 7న ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటింటి సందర్శించి బడీడు పిల్లలను గుర్తించారు.
- 3, 4, 5 రోజులు: 8, 9, 10 తేదీన కరపత్రాలతో ఇంటింటి ప్రచారం, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన, బడిమానేసిన పిల్లలను గుర్తించి చేర్పించడం, ప్రత్యేక అవసరాల పిల్లలను భవితా కేంద్రాల్లో చేర్పించడం.
- 11వ తేదీన నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష
- 12వ తేదీన అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించడం పిల్లలకు పాఠ్య, రాతపుస్తకాల పంపిణీ, ఉచిత యూనిఫామ్స్ అందజేత
- 13న సామూహిక అక్షరాభ్యాసం, బాలసభ
- 16న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల దినోత్సవం, తరగతి గదుల్లో విషయాల వారీగా అభ్యాసన సామర్థ్యాల వాల్‌పోస్టర్ల ప్రదర్శన, పిల్లలు రూపొందించిన చార్టులతో గదుల అలంకరణ, చదవడం, గణిత సంబంధిత వాటిపై క్విజ్ పోటీలు
- 17న సమీకృత విద్య, బాలిక విద్యాదినోత్సవం నిర్వహణ, బాలికా వివాహాలు, చిన్నారులపై వేధింపులను అరికట్టేందుకు ప్రతిజ్ఞ
- 18న తల్లిదండ్రులు, పోషకులు, గ్రామస్తులు, వార్డుసభ్యులను ఆహ్వానించి తరగతి గదుల్లో చేపట్టిన డిజిటలీకరణ, సౌకర్యాలు చూపించడం, మొక్కల పెంపక ప్రాధాన్యాన్ని పిల్లలకు వివరించడం.
- 19న బడిబాట ముగింపు సందర్భంగా పిల్లలకు క్విజ్‌పోటీలు.

అన్నిశాఖల సమన్వయంతో..

కలెక్టర్ ఆధ్వర్యంలో అన్నిశాఖలు, అన్ని వర్గాల ప్రజల సమన్వయంతో బడిబాటను ప్రగతిబాటపట్టిస్తాం. పాఠశాల విద్యాశాఖ అందించిన గైడ్‌లైన్స్ ప్రకారం కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. దీంతో పాటు పీఎంశ్రీ, మన ఊరు మనబడి, దాతల సహకారంతో ప్రత్యేకంగా పాఠశాలల్లో సమకూరిన సౌకర్యాలను, విద్యార్థులు సాధించిన విజయాలను కరపత్రాల ద్వారా తెలియజేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నాం.

– గోవిందరాజులు, డీఈఓ



ప్రజల చేత ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న ఆయా శాఖల అధికారులు

జిల్లా యంత్రాంగం సన్నద్ధం

కలెక్టర్ నేతృత్వంలో డీఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో జిల్లా స్థాయిలో కార్యాచరణ రూపొందించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై కెపాసిటీ బిల్డింగ్‌పేరిట జిల్లాలోని వివిధ కేటగిరిల ఉపాధ్యాయులకు ఇటీవల మూడు దఫాలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలల ప్రారంభం లోపు ఉచిత దుస్తువులు, పుస్తకాలు, నోట్‌బుక్స్ అందించడంతో పాటు విద్యార్థుల నమోదును పెంచేందుకు కలెక్టర్ క్షేత్రస్థాయిలో దిశానిర్దేశం చేశారు. సామాజిక సేవాసంస్థలు, ఎన్జీవోలు, తదితర వర్గాలను సమన్వయపర్చి బడిబాటను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులతో హైదరాబాద్, మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ల సభ్యులు

నారాయణపేట ఎడ్యుకేషన్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని డీఎంహెచ్ఓ మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో హైద్రాబాద్, మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన ఉచిత క్రికెట్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల దశలోనే క్రీడల పట్ల మక్కువ చూపాలన్నారు. క్రీడలతో శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. ఉచితంగా కోచింగ్ ఇవ్వడం సంతోషించదగ్గ విషయమంటూ.. అసోసియేషన్‌లను ప్రత్యేకంగా అభినందించారు. కోచింగ్ తీసుకున్న విద్యార్థులు భవిష్యత్‌లో క్రికెట్ పోటీల్లో సత్తా చాటి జిల్లాకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులకు సెర్టిఫికెట్లు జారీ చేశారు. సమ్మర్ క్రికెట్ క్యాంప్ ఇన్‌ఛార్జ్ రమణ, డాక్టర్ వినోద్, కోచ్ అజయ్. చెన్నారెడ్డి, జనార్ధన్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్‌లో పెరుగుతున్న నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 11.7 అడుగుల మేర నీటిమట్టం నిల్వ ఉంది. పాత అలుగు స్థాయి నీటి మట్టం 26.6 అడుగులు కాగా.. గేట్ల స్థాయి వరకు 32.6 అడుగులు. జూరాల ఎత్తిపోతల పథకం నీటి విడుదల ఇలాగే కొనసాగితే ఈ నెలాఖరు వరకు పాత అలుగుకు నీటిమట్టం చేరే అవకాశం ఉంది.

క్లుప్తంగా

మనస్తాపానికి గుర్రై వ్యక్తి బలవన్మరణం



అయిజ: పంట పొలానికి బాట లేదని చెప్పినందుకు మనస్తాపానికి గుర్రై వ్యక్తి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆదివారం అయిజ మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. బంధువుల వివరాల ప్రకారం.. అయిజ పట్టణానికి చెందిన దేవర మహేష్ (45) 393 సర్వే నంబర్‌లో ఉన్న తన పొలానికి వెళ్లేందుకు ప్రయత్నించగా, కొందరు వ్యక్తులు మీకు ఇటువైపుగా బాట లేదని చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన మహేష్ ఇంటికి వెళ్లి ఉరేసుకొని బలవన్మరణం చెందాడు. మహేష్ మృతదేహాన్ని బాట ఇవ్వమని చెప్పిన వారి ఇంటిముందు ఉంచి నిరసన తెలిపారు. ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను శాంతింపజేశారు. సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మహేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

గండీడ్/మహమ్మదాబాద్: ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. నారాయపేట జిల్లా కోస్గి మండలం మల్‌రెడ్డిపల్లికి చెందిన అలికె మొగులయ్య(45)ను అదే గ్రామానికి చెందిన గొల్ల నర్సయ్య గొర్రెలు కడగడానికి గండీడ్ మండలంలోని వెన్నాచేడ్‌లో పెద్దచెరువుకు వెళ్దామని చెప్పాడు. ముందుగా అనుకూలంగా ఉందో.. లేదో చూసి వద్దామని చెప్పాడు. ఆదివారం ఉదయం ఎనిమిదిన్నర గంటల ప్రాంతంలో మరొకరితో కలిసి మొగులయ్య వెన్నాచేడ్‌లోని పెద్దచెరువుకు చేరుకున్నాడు. చెరువు పెద్ద తూము వద్ద లోతు చూద్దామని నీటిలోకి దిగాడు. అక్కడ ఎక్కువ లోతు ఉండడంతో మునిగిపోయాడు. బయట ఉన్న మిగతావారు మొగులయ్య పైకి రాకపోవడంతో అనుమానం వచ్చి నీటిలో దిగి బయటికి లాగారు. అప్పటికే మొగులయ్య మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలోని లింగమయ్య కాలనీకి చెందిన చంద్రకాంత్ (30) అనే యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రజిత తెలిపిన వివరాల మేరకు.. చంద్రకాంత్ శుక్రవారం ఇంట్లోనే ఉరి వేసుకుని మృతి చెందాడు. ఏడాది క్రితం కుటుంబ కలహాల నేపథ్యంలో మృతుడి భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో చంద్రకాంత్ జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసుకొని పోస్టుమర్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

మహమ్మదాబాద్: తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలోని కంచన్‌పల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోతుల అశోక్(24) గత రెండేళ్ల క్రితం వివాహమైంది. అయితే గ్రామంలో చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన అశోక్ కొన్నిరోజులుగా మహబూబ్‌నగర్‌లో ఉంటూ ఎలాంటి కూలీ పనిచేయకుండా ఉంటున్నాడు. దీంతో కుటుంబం గడవని పరిస్థితి నెలకొని మనస్తాపానికి గురయ్యాడు. శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు స్థానిక జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అజిలాపూర్ లిఫ్ట్‌కు గ్రీన్‌సిగ్నల్




కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

- రూ.32 కోట్లతో ఎత్తిపోతల పథకం మంజూరు
- 5 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం
- రెండు దశల్లో పనులు.. త్వరలోనే టెండర్లు

దేవరకద్ర రూరల్: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ వేలాది ఎకరాలకు చుక్కనీరు అందడం లేదు. ఎత్తయిన ప్రదేశంలో పొలాలు ఉండటమే ఇందుకు కారణం. దీంతో వందలాది ఎకరాలు బీడు భూములుగా మారాయి. తమ భూములుకు సాగునీటిని అందించాలని రైతులు గత ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. అయితే ఎట్టకేలకు ఈ ప్రాంత రైతుల ఆకాంక్షకు మోక్షం లభించింది. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కృషితో అజిలాపూర్‌లో లిఫ్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పథకం నిర్మాణం కోసం రూ.32 కోట్లు మంజూరు చేస్తూ ఇటీవల జీఓ జారీ చేసింది. త్వరలోనే పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ నిర్వహించనున్నారు.

రెండు దశల్లో పనులు..

ఎత్తిపోతల పథకం పనులను రెండు దశల్లో చేపట్టేందుకు సంబంధిత అధికారులు ప్రణాళిక రూపొందించారు. ముందుగా స్టేజ్–1లో భాగంగా కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి కొంత దూరంలో ఉన్న జీలుగ గుట్ట వద్ద 0.05 టీఎంసీ సామర్థ్యంతో పంప్‌హౌజ్ నిర్మించనున్నారు. పంప్‌హౌజ్ నుంచి పైప్‌లైన్ ద్వారా వచ్చే నీటిని నింపేందుకు అజిలాపూర్ సమీపంలోని పూరికుంట వద్ద మినీ రిజర్వాయర్ ఏర్పాటు చేయనున్నారు. అనంతరం ఓపెన్ కాల్వలు, పిల్ల కాల్వల ద్వారా సమీప రైతుల పొలాలకు సాగునీరు అందించనున్నారు.



అజిలాపూర్ ఎత్తిపోతల పథకం మ్యాప్

■ స్టేజ్–2లో భాగంగా కోయిల్‌సాగర్ నుంచి గతంలో ఏర్పాటు చేసిన గ్రావిటీ కెనాల్ ద్వారా వచ్చే నీటి ఆధారంగా గద్దెగూడెం చెరువు నట్టలవానికుంట వద్ద 0.05 టీఎంసీ సామర్థ్యంతో రెండో పంప్‌హౌజ్ నిర్మించనున్నారు. కిలోమీటరు దూరంలో రెండో మినీ రిజర్వాయర్ ఏర్పాటుచేసి.. అక్కడి నుంచి పైప్‌లైన్ లేదా కాల్వల ద్వారా గద్దెగూడెం, వెంకటాయపల్లి గ్రామాల పరిధిలో ఉన్న 5 కుంటలను నీటితో నింపనున్నారు. అక్కడి నుంచి రైతుల పొలాలకు నేరుగా సాగునీరు అందించనున్నారు.

కష్టాలు తీరుతాయి..



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు మా ఊరి పొలాలకు ఆనుకొని ఉన్నా చుక్క నీరు అందని పరిస్థితి. దీంతో ఇక్కడి భూములు బీడుగా మారాయి. గత పాలకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. అజిలాపూర్ లిఫ్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలపడం సంతోషంగా ఉంది. లిఫ్ట్ పనులు పూర్తయితే మాకు సాగునీటి కష్టాలు తీరుతాయి.

– రాజుగౌడ్, రైతు, అజిలాపూర్

వ్యవసాయం చేసుకుంటా..



నాకు ఆరెకరాల భూమి ఉన్నప్పటికీ సాగునీరు లేక వ్యవసాయం చేయడం లేదు. సాగునీటి కోసం కొన్నేళ్లుగా ఇబ్బంది పడుతున్నా. రైతుల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం ఇక్కడ లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. పనులు త్వరగా పూర్తిచేసి సాగునీరు అందిస్తే సంతోషంగా వ్యవసాయం చేసుకుంటా.

– తిరుమలయ్య, రైతు, అజిలాపూర్

ఇచ్చిన మాట కోసం..



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పక్కనే ఉన్నప్పటికీ సాగునీరు అందక 6 గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు దిగువ వైపు పొలాలు ఉన్న రైతులు సాగు చేసుకుంటే.. ఎగువ వైపు ఉన్న రైతులకు సాగునీరు అందక వలసలు పోతున్నారు. రైతులందరికీ సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అజిలాపూర్ లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నాం. పనులు వేగంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తాం.

– మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, దేవరకద్ర

6 గ్రామాలు సస్యశ్యామలం..

లిఫ్ట్ సామర్థ్యం 0.1 టీఎంసీ కాగా.. ముందుగా లక్ష్యం ప్రకారం 2 వేల నుంచి 3 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. అందుకోసం రెండు మినీ రిజర్వాయర్ల పరిధిలో మొత్తం 12 నీటి ట్యాంకులను ఏర్పాటు చేయనున్నారు. అందులో 4 ట్యాంకులు అజిలాపూర్, 7 ట్యాంకులు గద్దెగూడెం, ఒక ట్యాంక్ వెంకటాయపల్లి గ్రామ సమీపాల్లో నిర్మించనున్నారు. వీటి నుంచి అజిలాపూర్, నాగారం, చిన్నరాజమూర్, కోయిల్‌సాగర్, గద్దెగూడెం, వెంకటాయపల్లి గ్రామాల్లోని వ్యవసాయ పొలాలకు సాగునీరు అందించనున్నారు. అయితే 3వేల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యం కాగా.. మరో 2 వేల ఎకరాలకు అదనంగా సాగునీరు అందించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

లూజ్ విత్తనాలతో జాగ్రత్త



నాణ్యతా ప్రమాణాలు లేని లూజ్ విత్తనాలు



నాణ్యమైన ప్యాకింగ్ విత్తనాలు

అలంపూర్: వానకాలం పంటల సీజన్ ఆరంభమవుతోంది. అన్నదాతలు ఆరుగాళం కష్టించడానికి సిద్ధమవుతున్నారు. పంటసాగులో కీలక భూమికను నిర్వహించే విత్తనాల కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్న వానకాలం సీజన్‌కు కావాల్సిన విత్తనాల కొనుగోలు చేసే రైతులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియానాయక్ సూచించారు. దళారులు రైతులకు లూజ్ విత్తనాలు విక్రయించి మోసం చేస్తారని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు లూజుకు కంపెనీ(ప్యాకెట్లలో) తేడాలు తెలుసుకుంటే మంచిదన్నారు. ఈ విషయంలో అవగాహన ఉంటే పంటసాగు నుంచే ఇలాంటి నష్టాలను నివారించుకోవచ్చని అవగాహన కల్పిస్తున్నారు.

పాడి-పంట

జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

దళారులు అమ్మే లూజ్ విత్తనాలు

- ■ విత్తనాలకు ఎటువంటి నాణ్యత ఉండదు.
- ■ విత్తనాల తయారీలో కంపెనీ, ధృవీకరణ అధికారుల ప్రమేయం ఉండదు.
- ■ లూజు విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో ఎటువంటి బిల్లు ఇవ్వరు.
- ■ ప్రాసెసింగ్, శుద్ధి ఇతర ప్రమాణాలు ఉండవు.
- ■ విత్తనాలు విత్తినప్పుడు, పంట మధ్యకాలంలో పూత, కాత దశలో ఏమైనా నష్టాలు జరిగితే రైతులకు న్యాయం జరగదు.
- ■ విత్తనాలకు జన్యు నాణ్యత ఉండదు.
- ■ విత్తనాలను దళారులు రైతులను మోసం చేసేవారు మాత్రమే విక్రయిస్తారు.

కంపెనీ ప్యాకుడు విత్తనాలు

- ■ విత్తనాలకు పూర్తి నాణ్యత ఉంటుంది.
- ■ విత్తనాల తయారీలో వివిధ దశల్లో కంపెనీ, ధృవీకరణ అధికారులు పాల్గొంటారు.
- ■ విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా బిల్లు ఇస్తారు.
- ■ విత్తన తయారీలో ప్రాసెసింగ్, శుద్ధి, ఇతర నాణ్యత ప్రామాణాలు తప్పక పాటిస్తారు.
- ■ విత్తనాలు కొనగోలు చేసిన సమయంలో రైతులకు బిల్లు ఇస్తారు. కాబట్టి పూర్తి న్యాయం జరుగుతుంది.
- ■ విత్తనాలకు ఖచ్చితంగా జన్యు నాణ్యత ఉంటుంది.
- ■ ఈ విత్తనాలు వ్యవసాయ శాఖవారిచే లైసెన్సు పొందిన డీలర్లు విక్రయిస్తారు.

లైసెన్సు డీలర్ల వద్దనే కొనాలి

ఖరీఫ్‌లో పంటసాగు చేసే రైతులు వ్యవసాయ అధికారులతో లైసెన్సులు పొందిన డీలర్ల వద్దనే కొనుగోలు చేసుకోవాలి. కొనుగోలు చేసిన దుకాణాల్లో తప్పక రశీదు తీసుకోవాలి. పంట కాలం పూర్తయ్యే వరకు వాటిని భద్రంగా దాచి ఉంచాలి. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు లూజు విత్తనాలు అమ్మడానికి వస్తే కొనుగోలు చేయొద్దు. లూజు విత్తనాలు విక్రయించడానికి వస్తే వారి సమాచారం వ్యవసాయ అధికారుకుల తెలపాలి.

లారీల ఢీ.. తప్పిన ప్రమాదం



దివిటిపల్లి బ్రిడ్జిపై ప్రమాదానికి గురైన లారీలు, కారు

భూత్పూర్: దివిటిపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. జడ్చర్ల నుంచి భూత్పూర్ వైపు పల్లిపొట్టు లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎదురుగా భూత్పూర్ వైపు నుంచి వస్తున్న లారీని సైతం ఢీకొట్టింది. భూత్పూర్ వైపు నుంచి వస్తున్న లారీ ప్రమాదానికి గురి కాగా డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో వెనకాల వస్తున్న ఓ కారు సైతం లారీని ఢీకొట్టింది. లారీ డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే పొట్టులారీ డ్రైవర్ పారిపోయాడు. రోడ్డు ప్రమాదం వల్ల రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. పోలీసులు క్రేన్ సాయంతో లారీని పక్కకు లాగి రాకపోకలను పునరుద్ధరించారు.

మూగజీవాల ఉసురుతీస్తున్న పిడుగులు



వెంకటాపూర్‌లో పిడుగుపాటుకు మృతిచెందిన కాడెద్దులు



చర్లఇటిక్యాలలో..



సిర్సనగండ్లలో మృతిచెందిన గేదెలు

బిజినేపల్లి/ తాడూరు/ చారకొండ: అన్నదాతలకు వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉండే కాడెద్దులు, మూగజీవాలను పిడుగుపాట్లు బలి తీసుకుంటున్నాయి. రూ.వేలు విలువ చేసే కాడెద్దులు అకాల మృత్యువాత పడుతుండటంతో రైతన్నలు తల్లడిల్లిపోతున్నారు. ఈ క్రమంలో ఆదివారం బిజినేపల్లి మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు శ్రీశైలం కాడెద్దులను పొలం వద్ద చెట్టు కింద కట్టేశాడు. అయితే సాయంత్రం వర్షంతోపాటు పిడుగు పడటంతో కాడెద్దులు మృతిచెందాయి. వీటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. అలాగే తాడూరు మండలంలోని చర్లఇటిక్యాలలోనూ రైతు బ్రహ్మానందరెడ్డికి చెందిన ఎద్దు పిడుగు పడి మృతిచెందింది. చారకొండ మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన రైతు అంజయ్య వ్యవసాయ పొలంలో కట్టేసిన పాడిగేదెలు పిడుగు పడి మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు. బాధిత రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పోలీస్‌స్టేషన్ వెనక ఇంట్లో చోరీ



ఇంట్లో చిందరవందరగా పడిన దుస్తులు

జడ్చర్ల టౌన్: పోలీస్‌స్టేషన్‌కు ఆనుకుని ఉన్న ఇంట్లో దొంగలు పడి చోరీకి పాల్పడిన సంఘటన ఆదివారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. జడ్చర్ల పోలీస్‌స్టేషన్ వెనక వైపు ప్రహరీకి ఆనుకుని నిజాం అనే వ్యక్తికి చెందిన ఇళ్లు ఉంది. బక్రీద్‌సందర్భంగా పట్టణంలోని హౌజింగ్‌బోర్డుకాలనీలో ఉంటున్న తన సోదరుడి ఇంటికి శనివారం వెళ్లారు. ఆదివారం ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంట్లో బీరువా తాళం విరగ్గొట్టి ఉండటం, దుస్తులు చిందరవందరగా వేసి ఉండటాన్ని గుర్తించాడు. అందులో ఉన్న 6 తులాల బంగారు నగలు, 30 తులాల వెండి, రూ.40 వేల నగదు చోరీకి గురైందని గుర్తించి.. డయల్ 100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై పోలీసులు ఎవరూ స్పందించలేదని తెలిసింది.

కోడెదూడపై అడవి జంతువు దాడి

ధరూర్: మండలంలోని కొత్తపాలెం శివారులో రైతు రమేశ్‌కు చెందిన కోడెదూడపై ఓ అడవి జంతువు దాడి చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. బాధితుడి కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం తనకున్న రెండు కాడెద్దుల తోపాటు ఒక ఆవు, కోడెదూడలను తన వ్యవసాయ పొలం వద్ద కట్టేసి ఉంచాడు. రాత్రి కొంత మేత వేసి ఇంటికి చేరుకున్నాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా.. కోడెదూడ కనిపించలేదు. పరిసరాల్లోని పొలాలు, గుట్టల్లో వెతకగా.. కోడెదూడ మృతిచెంది ఉండడాన్ని గమనించి బోరుమన్నాడు. ఆ ప్రాంతంలో చిరుత జాడలుగా గుర్తించి ఆందోళన చెందారు. విషయంపై ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వగా.. అక్కడికి చేరుకుని గుర్తులు, జాడలను గుర్తించారు. ఐనాకు కూడా ఇలాంటి గుర్తులే ఉంటాయని, భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కొన్నిరోజులు రైతులు తమ పశువులను ఇళ్ల వద్ద కట్టేసి ఉంచుకోవాలని, పొలాల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ ఉంచవద్దని సూచించారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదెల మృతి

రాజాపూర్ (బాలానగర్): బాలానగర్ మండలంలోని రాఘవాపూర్ గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన పిట్టల లక్ష్మయ్యకు చెందిన గేదెలు పొలంలో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ వైర్లు తెగిపడడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందించి తనను ఆదుకోవాలని బాధిత రైతు లక్ష్మయ్య కోరాడు.

- వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం
- పలువురికి తీవ్రగాయాలు

రక్తమోడిన రహదారులు

ఉమ్మడి జిల్లాలో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. మరికొందరు తీవ్రగాయాలపాలయ్యారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల డ్రైవర్ల అతివేగం, అజాగ్రత్తకు ఓ నిండు ప్రాణం బలి కాగా.. నవాబుపేట మండలం కొల్లూరు గేట్ సమీపంలో ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం చెందారు. ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. గండేడ్ మండలం బల్సూర్‌గొండ సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు, మిడ్జిల్ మండలం వేముల శివారులో బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో మరొకరు మృతి చెందారు.

– నవాబుపేట/కొత్తకోట రూరల్/మిడ్జిల్/గండేడ్/మహమ్మదాబాద్

అతివేగానికి నిండు ప్రాణం బలి



తోమాలపల్లి సమీపంలో ప్రమాదానికి గురైన ట్రావెల్స్ బస్సు

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తకు ఓ నిండు ప్రాణం బలైంది. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి వివరాల మేరకు.. ఓ ట్రావెల్స్‌కు చెందిన బస్సు చిత్తూరు నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికులతో బయలుదేరింది. డ్రైవర్ అతివేగం, అజాగ్రత్త కారణంగా పెబ్బేరు మండలం తోమాలపల్లి సమీపంలో బస్సు అదుపుతప్పింది. ఈ క్రమంలో ముందు వెళ్తున్న కర్ణాటకకు చెందిన బస్సును తప్పించబోయి పక్కనే వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో ట్రావెల్స్ బస్సు హెల్పర్ నాగేంద్ర ప్రసాద్ (19) అనే యువకుడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ సురేశ్‌తో పాటు ప్రయాణికులు స్వాతి, క్రాంతిలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న హైవే సిబ్బంది, పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి సుబ్బారాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

శుభకార్యానికి వెళ్లొస్తూ అనంతలోకాలకు..



లక్ష్మమ్మ (ఫైల్)



యాదగిరి (ఫైల్)

బంధువుల ఇంట్లో వివాహ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం చెందిన విషాదకర ఘటన నవాబుపేట మండలం కొల్లూరు గేట్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. నవాబుపేటకు చెందిన మరికంటి లక్ష్మమ్మ (52), ఆమె కుమారుడు యాదగిరి (20) కొందుర్గు మండలం ఆగిర్యాలలో జరిగిన బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యారు. వేడుక అనంతరం అక్కడి నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరారు. అయితే మార్గమధ్యంలోని కొల్లూరు గేట్ సమీపంలో అతివేగంగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో తల్లీకొడుకుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడగా.. డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జిల్లా ఆస్పత్రికి తరలించారు. తల్లీకొడుకు మృతితో నవాబుపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతురాలు లక్ష్మమ్మకు మొత్తం ఐదుగురు సంతానం కాగా.. ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో మృతుడు యాదగిరి చివరి వాడు. మిగిలిన అందరి వివాహాలు జరిగాయి. మృతురాలి భర్త వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి..



చంద్రునాయక్ మృతదేహం

బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మిడ్జిల్ మండలం వేముల శివారులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బాలానగర్ మండల పోచ్చమ్మగడ్డ తండాకు చెందిన చంద్రునాయక్ (42) మిడ్జిల్ మండలంలో జరిగిన వివాహ వేడుకలకు హాజరై తిరిగి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో వేముల శివారులో బైక్ అదుపుతప్పి కిందపడటంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

అమ్మమ్మ అంత్యక్రియలకు కట్టెలు తెచ్చేందుకు వెళ్లి..

■ ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి దుర్మరణం



బాలవర్ధన్‌రెడ్డి (ఫైల్)

తన అమ్మమ్మ అంత్యక్రియలకు అవసరమైన కట్టెలు తీసుకురావడానికి ట్రాక్టర్‌పై వెళ్లిన మనువడు దుర్మరణం చెందిన ఘటన గండేడ్ మండలం బల్సూర్‌గొండ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. బల్సూర్‌గొండకు చెందిన మల్లెపల్లి పద్మమ్మ (70) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని దహనం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. ఇందుకు అవసరమైన కట్టెలు తీసుకురావడానికి పద్మమ్మ మనువడు మల్లెపల్లి బాలవర్ధన్‌రెడ్డి (40) ట్రాక్టర్ తీసుకొని గండేడ్‌కు వెళ్లాడు. కట్టెలు లోడు చేసుకొని తిరిగి వస్తుండగా.. కొండాపూర్ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న బాలవర్ధన్‌రెడ్డికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అమ్మమ్మ, మనువడు ఇద్దరు ఒకే రోజు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రెండు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. మధ్యాహ్నం పద్మమ్మ అంత్యక్రియలు నిర్వహించగా.. సాయంత్రం బాలవర్ధన్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. అతడికి భార్య ఉంది. గ్రామంలో వీబీకేగా పనిచేసే వాడని గ్రామస్తులు తెలిపారు.

తెలుగు వెలుగులు సాకారమయ్యేనా?

- ఈ విద్యాసంవత్సరం నుంచే సీబీఎస్‌ఈ స్కూళ్లలో తెలుగు తప్పనిసరి చేస్తామన్న సీఎం
- ఐబీ, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ అన్ని రకాల స్కూళ్లలో అమలుకు ఆదేశాలు
- పక్కాగా అమలుకు వెంటనే మార్గదర్శకాలు ఇవ్వాలంటున్న టీచర్లు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: తెలుగుకు మళ్లీ పూర్వ వైభవం తెచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనలు చేస్తోంది. అన్ని రకాల సిలబస్ స్కూళ్లలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటనపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతంలో తెలుగు మీడియంలో చదువుకొని ఉన్నత స్థానాలను అధిరోహించినవారు ఎందరో ఉన్నా, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్ మీడియానికి ప్రాధాన్యం పెరిగింది. ఈ క్రమంలో తెలుగు ప్రాధాన్యం తగ్గిపోతోంది. అయితే మాతృ భాషలో చేసే వ్యక్తీకరణ మరే ఇతర భాషల్లోనూ రాదన్నది భాషా నిపుణుల అభిప్రాయం. ఐదో తరగతి వరకు మాతృ భాషలో బోధన ఉండాలని, 8వ తరగతి వరకు ఉంటే మరింత మేలని నూతన విద్యా విధానం చెబుతోంది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు అన్ని రకాల సిలబస్ స్కూళ్లలో తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేస్తామని ఆ దిశగా చర్యలు చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ వంటి సిలబస్ కలిగిన స్కూళ్లలోనూ అమలు చేయాలని స్పష్టం చేశారు. అయితే ఈనెల 12 నుంచే పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో దీనికి సంబంధించిన మార్గదర్శకాలు జారీ కావాల్సి ఉంది.

గతంలో ఉత్తర్వులు జారీ చేసినా..

రాష్ట్రంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయాలని తెలంగాణ (కంపల్సరీ టీచింగ్ అండ్ లెర్నింగ్ ఆఫ్ తెలుగు ఇన్ స్కూల్స్) యాక్ట్ 2018ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. అదే ఏడాది జూన్ 30వ తేదీన దశల వారీగా తెలుగు అమలు కోసం జీవో 24ను కూడా జారీ చేసింది. అయినా రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా పక్కాగా అమలుకు నోచుకోవడం లేదు. రాష్ట్ర సిలబస్ కలిగిన కొన్ని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలతో పాటు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ), కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ (ఐసీఎస్‌ఈ), ఇంటర్నేషనల్ బకలరియట్ (ఐబీ) సిలబస్ కలిగిన ఇంటర్నేషనల్ స్కూళ్లు తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయడం లేదు. రాష్ట్ర సిలబస్ కలిగిన చాలా ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, సీబీఎస్‌ఈ స్కూళ్లు తెలుగు ఆప్షనల్ సబ్జెక్టుగా మాత్రమే అమలు చేస్తున్నాయి. తప్పనిసరి కాకపోవడంతో విద్యార్థులు ఎవరూ తెలుగు సబ్జెక్టును పెద్దగా ఎంచుకోవడం లేదు. దీంతో ఆయా స్కూళ్లలో తెలుగు భాష అమలుకు నోచుకోవడం లేదు.

మెజారిటీ స్కూళ్లలో అమలు అంతంతే

ప్రస్తుతం రాష్ట్రంలో 42,901 పాఠశాలలు ఉండగా, అందులో 59,35,927 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం పాఠశాలల్లో 10,741 ప్రైవేటు పాఠశాలలు ఉండగా వాటిల్లో 33,93,010 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఆ స్కూళ్లు అన్నింటిలో తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయడం లేదు. కొన్ని స్కూళ్లు అమలు చేస్తుండగా, మరికొన్ని ఆప్షనల్‌గా అమలు చేస్తున్నాయి. మరోవైపు 533 సీబీఎస్‌ఈ సిలబస్ కలిగిన స్కూళ్లు ఉండగా, మిగితావి ఐసీఎస్‌ఈ, ఐబీ సిలబస్ స్కూళ్లు ఉన్నాయి. వాటిల్లో ప్రస్తుతం దాదాపు 4 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లోనూ తెలుగు పక్కాగా అమలుకు నోచుకోవడం లేదు.

ఇకనైనా 'తప్పనిసరి తెలుగు'అమలయ్యేనా

సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ సిలబస్ కలిగిన పాఠశాలల్లో 9, 10 తరగతులకు సంబంధించిన రాష్ట్రేతర విద్యార్థుల కోసం సింపుల్ తెలుగు పాఠ్య పుస్తకం 'వెన్నెల'ను సీఎం రేవంత్‌రెడ్డి గత ఫిబ్రవరి 26వ తేదీన ఆవిష్కరించారు. ఆ సమయంలో అన్ని రకాల సిలబస్ కలిగిన స్కూళ్లలో తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా 2025–26 విద్యా సంవత్సరంలో అమలు చేస్తామని చెప్పారు. దానిని ఇప్పుడు ఆచరణలోకి తీసుకురావాల్సి ఉంది. ఇది అమల్లోకి వస్తే ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు టీచర్లకు డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు.

వెంటనే మార్గదర్శకాలు ఇవ్వాలి



సీబీఎస్‌ఈ స్కూళ్లలో తెలుగు సబ్జెక్టు ఉండాల్సిందే. తప్పనిసరి కాకపోవడం వల్ల పిల్లలకు మాతృభాష రావడం లేదు. నాలుగైదేళ్ల నుంచి అమలు చేస్తామంటున్నారు. ఇప్పటికీ మార్గదర్శకాలు ఇవ్వలేదు. వెంటనే ఇవ్వాలి.

– సునీల్, తెలుగు టీచర్, జగిత్యాల

అమలు చేస్తే మేలు



ప్రస్తుతం ప్రైవేటు స్కూళ్లలో తెలుగు టీచర్ల సంఖ్య చాలా తక్కువ. అందులోనూ సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీలాంటి స్కూళ్లల్లో మరింత తక్కువే. ఇప్పుడు తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేస్తే తెలుగు టీచర్లకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.

–కనుకు గోపి, తెలుగు పండిట్, సూర్యాపేట

అవకాశాలు పెరుగుతాయి..



తెలుగు పండిట్ శిక్షణ చేసిన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ప్రతి స్కూల్లో పోస్టులు వస్తాయి. దీంతో వారి జీవితాలు మెరుగు పడతాయి.

–గిర్ని అంజాగౌడ్, పాపన్నపేట, సంగారెడ్డి

తెలుగు టీచర్లకు ప్రాధాన్యం



సీబీఎస్‌ఈ స్కూళ్లలో తెలుగు తప్పనిసరి చేస్తే తెలుగు టీచర్లకు ప్రాధాన్యం పెరుగుతుంది. విద్యార్థులకు మేలు జరుగుతుంది. తెలుగు భాషను రక్షించుకోవడం అందరి బాధ్యత.

– సత్యంబాబు, తెలుగు టీచర్, ఖమ్మం

ప్రథమ భాషగా చేయాలి



తెలుగును ప్రథమ భాషగా చేయాలి. అన్ని రకాల సిలబస్ కలిగిన స్కూళ్లలో కచ్చితంగా అమలు చేయాలి. ఇంగ్లిష్ మీడియంలోనూ పక్కాగా అమలు చేయాలి.

–రాంబాబు. తెలుగు టీచర్, మహబూబాబాద్

క్లుప్తంగా...

హైరిస్క్ గర్భధారణపై జాతీయ సదస్సు

పాల్గొన్న గైనకాలజిస్టులు, సర్జన్లు

హైదరాబాద్: యశోద హాస్పిటల్స్–హైటెక్‌సిటీ ప్రసూతి, గైనకాలజీ విభాగం అధ్వర్యంలో హైరిస్క్ గర్భధారణపై ఆదివారం జాతీయ స్థాయి సదస్సు, లైవ్‌వర్క్‌షాప్ నిర్వహించారు. 500 మందికి పైగా గైనకాలజిస్టులు, సర్జన్లు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ ఈ సదస్సులో విభిన్న వైద్య విభాగాల నుంచి అనుభవజ్ఞులైన ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొన్నారన్నారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ నిర్వహణలో ఇబ్బందులను అధిగమిస్తూ నూతన మార్గదర్శకాలు, ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి సంక్లిష్టమైన సర్జరీలను మరింత సులభంగా, ఖచ్చితత్వంతో ఎలా నిర్వహించాలో అవగాహన కల్పించారనానరు. యశోద హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ ప్రసూతి సమయంలో అత్యంత క్లిష్టమైన గర్భధారణలో విజయవంతంగా తల్లీబిడ్డలను క్షేమంగా కాపాడడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు.

బాలు పాటలు చిరస్థాయిగా నిలిచిపోతాయి: తనికెళ్ల



తనికెళ్ల భరణికి బాలు నటనా పురస్కారాన్ని అందజేస్తున్న అంబికా కృష్ణ తదితరులు

హైదరాబాద్: చరిత్ర ఉన్నంత కాలం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటలు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని తనికెళ్ల భరణి అన్నారు. ఆదివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభలో కొండూరి భారతి సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ పుట్టినరోజు సందర్భంగా సినీనటులు తనికెళ్ల భరణికి ఎస్పీ బాలు నటనా పురస్కారాన్ని అందజేశారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అధ్యక్షతన జరిగిన సభలో అతిథులుగా మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ప్రముఖ దర్శకులు రేలంగి నర్సింహారావు , తుమ్మలపల్లి రామసత్యానారాయణ, గాయకుడు చింతలపూడి త్రినాథరావు, సినీనేపథ్య గాయకుడు వినోద్‌బాబు, రామచారి, శశికళాస్వామి విజయలక్ష్మి, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 79 పాటలతో 21 మంది గాయనీ గాయకులతో నిర్వహించిన ఏకగళ స్వరార్చన అందరినీ అలరించింది.

మదర్ డెయిరీ మనుగడ ప్రశ్నార్థకం!

నష్టాల ఊబిలో సంస్థ

- బిల్లులు అందక 25 వేల మంది పాడి రైతుల్లో ఆందోళన
- సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపాలని విన్నపం

ఆలేరు: మదర్ డెయిరీ (నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ లిమిటెడ్–నార్ముల్) భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి దివాళా అంచున నిలబడింది. పాడి రైతులకు బకాయిలు చెల్లించలేని దీనస్థితి. శుక్రవారం ఆలేరు నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. మదర్‌డెయిరీకి చేయూతపై ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో ఉద్యోగులు, రైతులు పెట్టుకున్న కాస్తోకూస్తో ఆశలు ఆవిరయ్యాయి.

రైతులకు బకాయిలు ఇలా..

ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మదర్ డెయిరీ కింద పాల ఉత్పత్తిదారుల సంఘాలు గుర్తింపు పొందినవి 300 ఉండగా.. ఓటు హక్కు లేని సభ్యులున్న సంఘాలు మరో 150 ఉన్నాయి. రైతుల వద్ద సేకరించిన పాలు రెండు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 23 పాల శీతలీకరణ కేంద్రాలకు వస్తాయి. ఆయా సంఘాల పరిధిలోని 25వేల మంది పాడి రైతులకు ఐదు బిల్లులకు సంబంధించి సుమారు రూ.25 కోట్లు చెల్లించాల్సి ఉంది.

అప్పులు, వడ్డీలు ఇవీ..

చిట్యాల వద్ద మదర్ డెయిరీకి సుమారు 30 ఎకరాల భూమి ఉంది. ఆ స్థలంపై గడిచిన కొన్నేళ్లుగా రూ.35 కోట్ల వరకు రుణం(ఓడీ) తీసుకున్నారు. ఇందుకు నెలకు రూ.45 లక్షల వడ్డీ చెల్లిస్తున్నారు. ఇక 600 మంది ఉద్యోగులు, ఇతర సిబ్బందికి నెలకు రూ.కోటిన్నర నుంచి రూ.2 కోట్ల వరకు జీతాలు చెల్లిస్తున్నారు. ఇతరత్రా నిర్వహణ ఖర్చులు తడిసి మోపడవుతున్నాయి.

పడిపోయిన సేల్స్..

గత రెండేళ్లగా మదర్ డెయిరీ రైతుల నుంచి సేకరించిన పాలకు, విక్రయాలకు మధ్య చాలా తేడా ఉంది. సుమారు రోజుకు లక్ష లీటర్ల పాలు సేకరిస్తే... 60వేల లీటర్లు మాత్రమే సేల్స్ ఉంటున్నాయి. దాదాపు 40వేల లీటర్ల పాలను పౌడర్‌గా చేయడం, స్కిమ్ మిల్క్ రూపంలో బయట విక్రయించాల్సిన పరిస్థితి. దాంతో లీటర్‌కు రూ.6 చొప్పున సంస్థ నష్టపోయింది. దీనికితోడు ప్రైవేట్ డెయిరీలతో సవాళ్లు ఎదురవుతున్నాయి. జీతాలు కూడా ఆలస్యమవుతున్నాయని, ఏప్రిల్ నెల జీతం జూన్‌లో చెల్లించారని ఓ ఉద్యోగి 'సాక్షి'తో ఆవేదన వ్యక్తం చేశారు.



రూ. 80 కోట్ల నష్టాల్లో ఉంది

నేను చైర్మన్ అయిన తరువాత బ్యాంకర్లతో మాట్లాడుతూ.. రుణాలను సర్దుబాటు చేస్తూ ఇంత వరకు నెట్టుకొచ్చాను. ప్రస్తుతం బ్యాంకు ఖాతా ఆపరేటింగ్ అవడంలేదు. బ్యాంకర్లు టర్నోవర్ చేయనివ్వడం లేదు. మొత్తం రూ.80 కోట్ల నష్టాల్లో సంస్థ ఉంది. సంస్థను ఆదుకోవడానికి నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతున్నాం.

-మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్

డబ్బులు లేవు

25 వేల మంది రైతులకు సుమారు రూ.20 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. చిట్యాలలో ఉన్న 30ఎకరాలు విక్రయించి, రైతులకు బిల్లులు చెల్లించాలని పాలకమండలిలో నిర్ణయించారు. కానీ కొంతమంది డైరెక్టర్ల నుంచి అభ్యంతరం వ్యక్తమైంది.

-బి.కృష్ణ, మదర్ డెయిరీ ఎండీ

దుందుభిలో అక్రమ దందా!

నిబంధనలు అతిక్రమించి ఇసుక తరలింపు



క్వారీలో కొనసాగుతున్న ఇసుక తవ్వకాలు

- 9 మీటర్ల మేర తవ్వకాలు.. పట్టించుకోని అధికారులు
- జాడలేని టీజీఎండీసీ అధికారులు
- కొత్తపల్లి క్వారీలో ఇదీ పరిస్థితి

జడ్చర్ల: మిడ్జిల్ మండలం కొత్తపల్లి శివారు దుందుభి వాగులో ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతుంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్నా.. సంబంధిత శాఖల అధికారులు అటువైపు కన్నెతి కూడా చూడటం లేదు. రోజు వందలాది టిప్పర్ల ఇసుక ఇతర ప్రాంతాలకు తరలుతుండగా.. ఇసుకాసురులకు అధికారులు, పోలీసులు వంత పాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) వే బిల్లులు ఇవ్వడానికి మాత్రమే పరిమితమైంది. మిగతా పర్యవేక్షణ తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తుండగా.. రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు జాడ లేకుండా పోయారు. ఆయా శాఖల నుంచి కూడా ఇక్కడ సిబ్బందిని ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదు. నీటిపారుదలశాఖ అధికారుల పర్యవేక్షణ మచ్చుకైనా లేదు. ఇచ్చిన అనుమతుల మేరకే తవ్వకాలు చేపడుతున్నారా.. బఫర్ జోన్‌లోకి వచ్చారా అన్న విచారణ చేయని దుస్థితి నెలకొంది.

నిబంధనలు గాలికి..

కొత్తపల్లి ఇసుక క్వారీలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం 2.5 మీటర్లు తవ్వకాలు చేపట్టాల్సి ఉండగా.. సుమారు 9 మీటర్లకు పైగా తవ్వకాలు చేస్తున్నా అడిగే వారు కరువయ్యారు. ఇక సామర్థ్యానికి మించి ఇసుకను టిప్పర్లలో తరలిస్తున్నా పట్టించుకునే వారు లేరు. 10 టైర్ల లారీలో 12 క్యూబిక్ మీటర్లు (19.5 టన్నులు), 12 టైర్ల లారీలో 16 క్యూ.మీ (26 టన్నులు) మాత్రమే తరలించాల్సి ఉండగా అంతకుమించి లారీలపై చెక్కలు అడ్డుపెట్టి తరలిస్తున్నారు. టీజీఎండీసీ జారీ చేసే వేబిల్లులో 19.5 టన్నులని పేర్కొంటున్నా.. అధికంగా తరలిస్తున్నారు. అంతేగాక జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణాలకు మాత్రమే ఇసుకను రవాణా చేయాల్సి ఉండగా హైదరాబాద్, రంగారెడ్డి తదితర సుదూర ప్రాంతాలకు తరలించి హద్దులు దాటి సొమ్ము చేసుకుంటున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు ఇసుక తరలించాల్సి ఉన్నా.. అందుకు విరుద్ధంగా రేయింబవళ్లు తరలిస్తున్నారు. ప్రతి వాహనాన్ని జీపీఎస్ ద్వారా ట్రాక్ చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఇసుకను లారీలో నింపడానికి సుమారు రూ.9 వేలు వసూలు చేస్తుండగా.. దూరభారాన్ని బట్టి రూ.30 వేల నుంచి రూ.40 వేలకు పైగా విక్రయిస్తున్నారు.

జాడలేని అధికారులు..

ఇసుక క్వారీ పర్యవేక్షణను సంబంధిత అధికారులు గాలికొదిలేయడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవినీతికి పాల్పడి అక్రమాలను ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హద్దుల నిర్ధారణ వరకే మా బాధ్యత..

కొత్తపల్లి క్వారీకి సంబంధించి పట్టా భూముల హద్దుల నిర్ధారణ చేశామని, తదుపరి బాధ్యత టీజీఎండీసీ అధికారులదేనని తహసీల్దార్ రాజు తెలిపారు. హద్దుల లోపలే తవ్వకాలు చేస్తున్నారని, నిబంధనలు అతిక్రమిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి చర్యలు చేపడుతామని వివరించారు. టీజీఎండీసీ అధికారిని వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.



హైదరాబాద్‌కు తరలించేందుకు టీజీఎండీసీ జారీ చేసిన వేబిల్లు

పట్టించుకోని రవాణాశాఖ..

అధిక లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలను రవాణాశాఖ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. సామర్థ్యానికి మించి ఇసుకను తరలిస్తున్నా ఎక్కడకూడా రవాణాశాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదన్న విమర్శలున్నాయి.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్..

ఇసుక తవ్వకాల్లో అక్రమాలు జరిగితే సహించేది లేదని, రెవెన్యూశాఖ అధికారులు నిబంధనల ఉల్లంఘనపై చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆదేశించినా.. ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

జూరాలకు 5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు 7,500క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆదివారం రాత్రి 8 గంటలకు 5 వేల క్యూసెక్కులకు తగ్గినట్లు అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 92 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1,807 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.889 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



కొనసాగుతున్న నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్

క్రీడా పాఠశాల పిలుస్తోంది



జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో అథ్లెటిక్స్ శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు (ఫైల్)

- హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో స్పోర్ట్స్ స్కూళ్లు
- 4వ తరగతిలో విద్యార్థుల ప్రవేశాలకు ఎంపికలు
- ప్రతిపాఠశాలలో 20మంది బాలుర, 20 మంది బాలికలకు అవకాశం
- ఈనెల 16నుంచి వచ్చేనెల 5వరకు మూడంచెల్లో పరీక్షలు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాలకు త్వరలో మండల, జిల్లా, రాష్ట్రస్థాయి ఎంపికలు జరుగనున్నాయి. మేడ్చల్ జిల్లాలోని టీజీజీఎస్ఎస్ హకీంపేటతోపాటు కరీంనగర్, ఆదిలాబాద్‌లోని ప్రాంతీయ క్రీడాపాఠశాలల్లో 2025–26 సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులకు కొన్ని శారీరక, సామర్థ్యానికి పరీక్షలు నిర్వహిస్తారు. ఎవరైతే ఉత్తమ ప్రతిభ కనబరుస్తారో వారికి 4వ తరగతిలో ప్రవేశం లభిస్తుంది. రాష్ట్రంలో మూడు స్పోర్ట్స్ స్కూళ్లు ఉండగా ప్రతి పాఠశాలలో 4వ తరగతిలో 20మంది బాలుర, 20మంది బాలికలను ఎంపిక చేస్తారు. స్పోర్ట్స్ స్కూళ్లలో చోటుదొరికితే అంతర్జాతీయస్థాయికి ఎదగవచ్చని పలువురు క్రీడానిపుణులు పేర్కొంటున్నారు.

మూడంచెల్లో ఎంపికలు

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాల కోసం మూడంచెల్లో ఎంపికలు నిర్వహించనున్నారు. ఈనెల 16నుంచి 19 వరకు మండలస్థాయి, 23నుంచి 26వరకు జిల్లాస్థాయి, జూలై 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో ఎంపికలు నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయిలో ఎవరైతే ఎంపికవుతారో వారికి స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం కల్పిస్తారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్, రోయింగ్, వాలీబాల్, జూడో, ఫెన్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, రెజ్లింగ్ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఈనెల చివరి వారంలో జిల్లాస్థాయిలో స్పోర్ట్స్ స్కూళ్లకు ఎంపికలు నిర్వహిస్తాం. స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు పొందితే విద్యార్థులకు మెరుగైన క్రీడా శిక్షణ లభిస్తుంది. వారు నైపుణ్యమైన క్రీడాకారులుగా ఎదగవచ్చు. ఎంపికల్లో అర్హులైన విద్యార్థులు పాల్గొని ప్రతిభచాటాలి.

– శ్రీనివాస్, డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్

శారీరక, సామర్థ్య పరీక్షలు

విద్యార్థులకు శారీరక, సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఎత్తు, బరువు, 30మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800మీటర్ల రన్, 610 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీతోపాటు మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు. వీటితోపాటు జిల్లాస్థాయిలో అదనంగా మెడికల్ టెస్ట్ నిర్వహిస్తారు.

కావాల్సిన ధ్రువపత్రాలు

స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశ ఎంపికకు విద్యార్థులు పలు ధ్రువపత్రాలతో హాజరుకావాలి. ఒరిజినల్ ఆధార్ కార్డు, 4వ తరగతి చదువుతున్న సర్టిఫికెట్, వయస్సు ధృవీకరణ పత్రం, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, కమ్యూనిటీ సర్టిఫికెట్, ఐదు పాస్‌ఫొటోలు, విద్యార్థులు 8నుంచి 9ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి. 01.09.2016 నుంచి 31.08.2017 మధ్య పుట్టినవారు అర్హులు.

కాల్వ ఇలా.. నీరు పారేదెలా?



నెట్టెంపాడులో భాగమైన ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి వచ్చే కాల్వ గట్టు మండలంలోని పెంచికలపాడు శివారులో మొదలై.. ఆరగిద్ద, గొర్లఖాన్‌దొడ్డి, గట్టు, మాచర్ల, బల్గెర, ఇందువాసి వరకు పారుతోంది. అయితే ఈ కాల్వలో జమ్మితోపాటుగా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. దీంతో కాల్వలో నీరు ముందుకు పారక తరుచుగా కోతకు గురవుతోంది. కాల్వ నీటిపై ఆధారపడి పంటలు పండించుకుంటున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వచ్చే రెండు నెలల్లో కాల్వకు సాగునీటిని విడుదల చేస్తారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వ మరమ్మతు చేపట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు. - గట్టు